# కాలు జారింది

రచన :
శ్రీ కె. వి. రమణ

అక్కా!

'నేను అందంగా' చామనచాయగా' వుంటానని నీవు వొప్పుకుంటావని నాకు తెలుసు. నేను హరిజన కన్యను కావటం వలననే నాలోని గర్వం ఎక్కువయింది.

హరిజన కులంలో అందంగా వుండేవాళ్ళు బహు తక్కువ. ఒకవేళ వున్నా రనుకున్నా, చాల లావుగానో, కారు నలుపుగానో వుంటారు.

మిగతా స్త్రీలను చూస్తే నాకు పరమ అసహ్యం. కొంతకాలం క్రితం మిగతా కులాల స్త్రీ పురుషులు హరిజనులను చూసి "అసింట. అసింట" అంటుండే వారు. మైలపడి పోతారేమో నన్న భయం వలన. అందువల్లనే వాళ్ళంటే నాకు అసహ్యం: అసహ్యమే కాదు, పరమ అసహ్యం కూడ.

అప్పుడు నేను అయిద్వో ఫారం చదువుకుంటున్నాను' చదువుకుంటున్నాననే గర్వం నాలో ఎక్కువగా వుండేది. ఉన్నమాట చెప్పటానికి భయం దేనికి? ఇలా నాలా చదువుకునే హరిజన కన్యలు చాల తక్కువ. మిగతా నా తరగతి విద్యార్థినులతో కలసి మెలసివుండే దాన్ని కాదు. స్కూలుకు వొంటరిగా వెళ్లేదాన్ని; వొంటరిగానే తిరిగొచ్చేదాన్ని.

అప్పుడు పూర్తి యౌవనంలో వున్నానని నేను అనుకునే దాన్ని. అప్పటికి నా వయస్సు పద్దెనిమిది సంవత్సరాలు.

స్కూలునుండి వచ్చేటప్పుడు, స్కూలుకి వెళ్లేటప్పుడు అందంగా నడుస్తుండేదాన్ని. కవులు ఆ నడకనే హంస నడక అంటారనుకుంటాను. బుద్ధి పుట్టినప్పుడల్లా ప్రక్కలకు అప్పుడప్పుడు చూస్తూండే దాన్ని. రోడ్డు మీద పోయే ముసలివాళ్ళ సంగతి యిక్కడ చెప్పటం అప్రస్తుతం. యువకుల మాట చెప్పనే అక్కరలేదు. వాళ్ళు కళ్లప్పగించి నా ప్రక్క చూస్తూ వుండిపోయే వారు.

నాలో ఎన్నో వున్నతమైన భావాలు వుండేవి. బాగా చదువుకుని హరిజన కులాన్ని బాగా అభివృద్ధిలోనికి తీసుక వద్దామని అనుకుంటుండే దాన్ని. హరిజనులు వెనుకబడిలేరు అని చాటుదామనిపించేది.

ఒకనాడు ఒంటరిగా బడినుండి యింటికి తిరిగి వస్తున్నాను. నేనొక సందుగుండా వస్తున్నాను. ఇంతలో ఎవరో నన్ను పిల్చినట్లయింది. వెనుదిరిగి చూశాను. ఒక అందమైన యువకుడు ఆగమని సౌంజ్ఞ చేశాడు. అతడు నా కపరిచితుడు. ఖరీదైన దుస్తులు వేసుకున్నాడు. ఆగటమా, ముందుకు పోవటమా అని ఆలోచిస్తూ వుండిపోయాను. ఇంతలో అతడు నా దగ్గరగా రానేవచ్చాడు.

"మీదే అనుకుంటాను యీ కవరు" అంటూ వక్షోజాల నంటిపెట్టుకున్న పుస్తకాలమీద పడేసి, నా జవాబు గురించైనా ఎదురు చూడకుండా, తలనొంచుకుని త్వరత్వరగా వెళ్ళిపోయాడు.

నిజానికి పుస్తకాల నుండి ఏ కవరూ పడి పోలేదు. ఆ కవరు కూడ నాదికాదు. ఆ కవరులో వుండేది అతని ప్రేమలేఖ కావచ్చునని అనుకున్నాను. అదే నిజమైనట్లయితే అతనికి తగిన శాస్తి జరపాల్సి వుంటుంది.

వేగంగా యింటి కొచ్చేశాను. దాన్ని విప్పి చదువుకున్నాను—

మీకు—

పోయిన సమయం తిరిగి రాదంటారు. మీ పుస్తకాల్ని బట్టి, మీరు చదువుకుంటున్నారనే నా వ్యూహ పొరపాటు కాదనుకుంటాను. మీ క్లాసు పుస్తకాలు చదివే టైములో దీన్ని చదవటానికి కొంత సమయాన్ని వినియోగిస్తారని ఆశిస్తాను.

మీ ఆకారానికి చామనచాయ ఎంతో శోభను చేకూరుస్తుంది. మీ మీనాల్లాంటి కండ్లకు కాటుక ఎంతో అందాన్నిస్తుంది. చెప్పటం మరచాను—మీరు అందమైనవారని, మీ అందానికి తగ్గట్టు మీ నడుము కవులు వర్ణించినట్లు సన్నంగా వుంది.

నేను రచయితను గాని, కవిని గాని కాను. లేకపోతే నేను మీపై ఎన్నో చక్కటికథలు అల్లగలిగి వుండే వాడిని.

ఇట్లు
"నేను."

ఈ వుత్తరం తాలూకా ఆయన వుద్దేశం ఏమిటో నా కర్థం కాలేదు. నేను ఆరోజున అమితంగా సంతోషించాను. ఎందుకో మాత్రం తెలియదు. అయినా యిక్కడ చెప్పటం అవసరం. ఆయన నన్ను 'మీరు' అని సంబోధించటం నా సంతోషానికి మొదటి కారణం కావచ్చు. ఇక రెండవది నా సౌందర్య వర్ణన.

మర్నాడు తప్పకుండా ఆయన అదే సమయానికి వచ్చి మరలా నాకు వుత్తరం అందిస్తాడు అని అనుకున్నాను. నవలలు చదవటం వలనా, చిత్రాలు చూడటం వలన కలిగిన అనుభవం మాత్రమే యిది. మర్నాడు అదేసమయానికి అటుప్రక్క మెల్లగా నడిచివచ్చాను, మధ్య మధ్య వెనక్కి తిరిగిచూశాను. కాని నేను అనుకున్నట్లు మాత్రం జరగలేదు.

ఆయన గురించి ఎదురుచూడటంతో వారం రోజులు గడిచిపోయాయి. ఆయని గురించి నా కెందుకింత ఆత్రుత? ఆయన నాతో మాట్లాడనే లేదే! మాటిమాటికి ఆయన రూపాన్ని తల్చుకుండేదాన్ని, ఆనందించేదాన్ని,

ఆనాడు ఆదివారం సాయలకాలం వొంటరిగా సముద్ర తీరానికి బయలు దేరాను. సముద్ర తీరానికి వెళ్లేసరికి దూరంగా ఒక యువకుడు కూర్చుని వున్నాడు ఆ కవరు యిచ్చిన యువకునిలాగే వున్నాడు. దానికి కారణం ఆరోజున వేసుకున్న అవే ఖరీదైన దుస్తులు. అతని ఆకారం కూడ అలాదే కనబడింది, ఆయన్ని దగ్గరగా వెళ్ళి చూడాలనిపించింది. ఆయన వెనకగా వెళ్ళాను, శబ్దంవిని ఆయిన వెనుదిరిగి చూశారు. ఆయనే! మరలా ఆయన్ని కలుస్తానో, లేదో అనుకునేదాన్ని. ఆయన యిక్కడ అకస్మాత్తుగా కనిపించటం నా అదృష్టం.

ఆయన నన్ను చూడగానే ఆశ్చర్యపోయారు.

"నమస్కార మండీ!" అన్నాను.

"మీరు...?" అని ఆగిపోయారాయన.

"మీరు నాకు ఆరోజున కవరిచ్చి వెళ్ళిపోయారు."

"నేనా?...మీరు పొరపాటు పడుతున్నారు," అన్నారు.

నిజానికి నేను పొరపడ్డానేమోననిపించింది.

"క్షమించండి, ఆయనే అనుకున్నాను నేను." అని వెనుదిరిగి వెళ్ళిపోతుండగా ఆయనే మరలా నన్ను పిల్చారు. దగ్గరగా వెళ్ళాను.

"కూర్చోండి." అన్నారు.

నేను సందేహంతో నిలబడిపోయాను.

"కూర్చోండి, సందేహిస్తున్నారా?... నేనే ఆరోజున కవరు యిచ్చింది."

కూర్చుంటూ అడిగాను-"మరి యింతకుముందు అడిగితే మీరు కాదన్నారే?"

"వూరికే!"

"మీ వుత్తరం చదివాను."

"చదువుతారని తెలుసు!"

"మీ వుత్తరం చదవకముందు మీకు తగిన శాస్తి జరపాలని అనుకున్నాను."

"అలా జరగవచ్చని వూహించాను. ఉత్తరం చదివాక ఆ భావం కలగలేదా?"

"లేదు."

"ఎంచేత?"

"ఎంచేతో చెప్పలేను. కాని మీగురించి అదేమార్గాన అదేసమయానికి వెళ్తుండేదాన్ని."

"నిజంగానా?"

"నిజంగానే!"

కొద్దిసేపు యిద్దరమూ మౌనంగా వుండిపోయాం.

నేను అడిగాను-"ఆవుత్తరంయొక్క భావం ఏమిటి?"

"తెలుగులోనేగా వ్రాశాను? భావం తెలియలేదా? మీ సౌందర్యాన్ని వర్ణించాను."

"మీరు చెప్పింది బాగానే వుంది. సౌందర్యం వర్ణించడంలో మీ వుద్దేశ్యం ఏమిటి?"

"నా వుద్దేశ్యం చెప్పి మీకు కోపం తెప్పించను."

"నాకు కోపంరాదు, చెప్పండి."

ఆయన అన్నారు - "మిమ్మల్ని నేను ప్రేమిస్తున్నాను."

ఆయన ఆమాటలంటారని నాకు బాగా తెలుసు.

"మా కులం తెలిస్తే మీరు నన్ను ప్రేమించటం మానేస్తారనుకుంటాను."

"తెలుసు-మీది హరిజన కులమని."

"ఎలా?"

"మీ అందాన్ని చూసినతరువాత ఆ విషయాలన్నీ కనుక్కోకుండా వుంటానా?"

నేనింకేమీ మాట్లాడలేకపోయాను.

"నేనంటే నీకిష్టంలేదా?"

"..............."

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీవు నన్ను ప్రేమిస్తున్నావో లేదో నాకు తెలియదు. ఆవిషయం నీనోటి వెంట వినాలి. నన్ను ప్రేమించమని నిన్ను బలవంత పర్చను. ప్రేమ బలవంతపరిస్తే లభించేదికాదని నాకు తెలుసు."

"ఈ మాటలు మీ హృదయ పూర్వకంగా అంటున్నారా?"

"ప్రేమించిన స్త్రీ ఎదుట ఏ వ్యక్తి కూడా అబద్ధం ఆడలేడు. ఒకవేళ అబద్ధం ఆడినట్లయితే అతని ప్రేమ కపటమైనది మాత్రమే."

"మీ నిర్మల హృదయాన్ని నాఎదుట పెట్టారనుకుని మీ మాటను స్వీకరిస్తున్నాను."

"నిజంగా నేను అదృష్టవంతుడ్ని. మీలాంటి అందగత్తెను పొందగలిగాను!"

ఆయన లేచారు.

"నన్ను నమ్మలా?"

"నమ్ముతున్నాను, కాని..."

"సరేలే, మన వివాహానికి తగిన ఏర్పాట్లు చేస్తాను."

* * *

ప్రేమ గుడ్డిదన్నాడు ఒక మహాకవి.

ప్రేమ అనేది ఒక పూజ్యమైన కండ్లకగుపించని వస్తువు. వస్తువు అనటం కంటె భావం అనటమే మంచిది. తల్లి దండ్రులు, అక్కాచెల్లెళ్ళు, పెద్దలు మొదలైన మీది ప్రేమభావం వేరు, భార్యాభర్తల ప్రేమ వేరు.

ప్రేమ అనేది రెండు హృదయాల కలయిక, కలయికలోని అనురాగం, అనురాగంలోని ఆనందం.

ప్రేమలోపడి కొంతమంది తమ సర్వస్వాన్ని విడిచిపెట్టుకుంటారు. ప్రేమలో అంతశక్తి వుండవచ్చు. అలా అని తాము చేసిన దోషాన్ని దానికంటగట్టడం తమ తెలివితక్కువ తనాన్ని నిరూపించుకోటం కాక మరేమిటి?

ప్రేమ గుడ్డిదా? ప్రేమ అనేది సుస్థిరమైన పూజ్య భావం, అదెలా గుడ్డిదవుతుంది?

మేం యిద్దరమూ ప్రతిరోజూ సంధ్యాసమయాన్న సముద్రతీరాన్న కలుసుకుంటుండేవాళ్లం. ఎన్నో విషయాలు మాట్లాడుకునేవాళ్లం. ప్రపంచపు ఆనందమంతా మా ఎదుటనే వున్నట్లనిపించేది. చాలా వేగంగా నెలరోజులు గడిచిపోయాయి. కాని ఆయన నా వివాహంగురించి ఎప్పుడూ మాట్లాడనేలేదు.

ఒక రోజున నేను ఆయన్ని అడిగాను.—"మన వివాహంగురించి మీరు ఏమిచేశారు?"

"ఏర్పాట్లు చేస్తున్నాను" అన్నారాయన.

"ఇప్పటికి నెలరోజులయింది—మీరామాట అని. నన్ను వివాహం చేసుకోవడం మీకు యిష్టం లేదనుకుంటాను."

"ఇష్టం లేదని ఎవరన్నారు?"

"ఎవరో ప్రత్యేకంగా వచ్చి చెప్పాలేమిటి? నన్ను పెళ్ళిచేసుకుందామని యిష్టం వున్నట్లయితే ఎంతో త్వరగా ఆ ఏర్పాట్లని పూర్తిచేసి వుండేవారు. పెళ్ళికాని పిల్లను ఎంతకాలమని యిలా మీ వెంట తిరగగలను ఎవరికైనా తెలిస్తే మన ఇద్దరి పరువూ పోతుంది. హద్దులు దాటితే అగౌరవం తప్ప యింకేమీ వుండదు."

"సరే నీవు చెప్పిన మాటను అంగీకరిస్తున్నాను. అయితే నా మాటకూడ విను. మనం యిక్కడ వివాహం చేసుకోవటం మన యిద్దరికీ శ్రేయస్కరం కాదు, మీ తల్లిదండ్రులైనా మన వివాహానికి ఆటంక పరచవచ్చు. మరో పట్టణానికి పోయి అక్కడ రిజిష్టరీ మేరేజ్ చేసుకుని మరలా ఇక్కడికి తిరిగి వద్దాం. అప్పుడే అభ్యంతరమూ వుండదు" అన్నారాయన.

ఆయన చెప్పిన వుపాయం బాగానే వుంది. నేను దానికి అంగీకరించాను. ఫలానారోజు నిశ్చయించుకున్నాం- మేం పట్టణం వెళ్లడానికి.

(తరువాయి 18వ పేజీలో)

(13వ పేజీ తరువాయి)

ఆరోజు రానేవచ్చింది. ఇంట్లో ఏదో అబద్ధం చెప్పేసి ఆయనతో బయలుదేరాను.

మే మిద్దరమూ మరో పట్టణానికి చేరేసరికి రాత్రి పదకొండు గంటలయింది. మేం రిక్షామీద స్టేషను నుండి బయలుదేరి ఒక విశ్రాంతి గృహానికి చేరుకున్నాం, గదిలోనికి వెళ్ళిన తరువాత నాలో నూతనోత్సాహము కలిగింది. అద్దంలో నా ముఖాన్ని చూచుకున్నాను. ఎంతో అందంగా కనిపించింది— నుదుట నున్న తిలకం 'నీవు ఆయన శ్రీమతివి కాబోతున్నావు. నీ అదృష్టమే అదృష్టం' అన్నట్లుంది అద్దంలోని నా ప్రతిబింబం.

మేం ఇద్దరమూ అలానే నిద్రపోయాము.

ఎవరో తలుపు తట్టిన చప్పుడు నా చెవిలో పడింది, కొద్ది సేపటివరకూ కదలలేదు. మరీ తలుపు తట్టడం ఎక్కువ కావడంచేత లేచి కూర్చున్నాను. ఇటూ అటూ చూశాను—ఆయనగురించి. ఆయన కనబడలేదు. వివాహపు ఏర్పాటు కొరకై వెళ్ళివుంటారని అనుకున్నాను.

ఆయన పెట్టె బెడ్డింగ్ లేకపోవడం చూసి నేను నిర్ఘాంతపోయాను. ఏమీ ఆలోచించుకోలేక పోయాను. తలుపు తెరిచాను. హోటల్ బోయ్ కాఫీ పట్టుకుని నిలబడ్డాడు. 'ఆయన ఎక్కడికి వెళ్ళారు'ని అడిగాను. వాడు చెప్పాడు—

"ఆమె యింకా నాలుగురోజులు ఇక్కడే వుంటుంది" అని చెప్పి మొత్తం డబ్బు చెల్లించివేసి అతడు వెళ్ళిపోయాడట.

ఇప్పుడు నా గతి అధ్వాన్నంగా తయారైంది.

స్త్రీ కుండవలసిన శీలం నాలో యిప్పుడు నశించిపోయింది. ఇంతవరకూ మంచి మార్గాన్నే నడుస్తున్నాననుకున్నాను. అయితే తప్పుడుమార్గమయిపోయింది. ఇలాంటి వంచకులుంటారని నాకు తెలుసు. కాని అతడి ముఖం చూస్తే నాకు అలా అనిపించలేదు.

నీవు చెప్పిన నీతుల్ని నేను పాటించలేకపోయినందుకు యిప్పుడు పశ్చాత్తాప పడుతున్నాను. పశ్చాత్తాప పడటంవలన లాభం లేదని నాకు తెలుసు. ఇప్పుడీ వుత్తరం యిక్కడినుండే వ్రాస్తున్నాను. ఇప్పుడు ఏముఖం పెట్టుకుని యింటికి తిరిగి రాగలను. ఇంటిలో అడుగుపెట్టే యోగ్యత పోగొట్టుకున్నానక్కా!

ఇట్లు
నీ చెల్లి,
నీరజాక్షి.



SEENU & CO., 28 K. TANDAVARAYA GRAMANI ST. MADRAS-21.
GRAMS: "ORCAS" (ESTD 1946) PHONE 55357.
BRANCH: SINGAPORE-8 (CEYLON) AGENTS: N.C.M. STORES 82, MAIN ST. COLOMBO-11.
(ADVT. PERMITTED UNDER G.O.MS. NO 1121 HEALTH.)